క్లుప్తంగా

స్పాట్ వ్యాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటుకు వినతి

నారాయణపేట రూరల్ : కొత్త జిల్లా ఏర్పాటు కావడంతో పట్టణంలో పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ భాషో పాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. రాష్ట్ర సహ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో మహబూబ్‌నగర్‌కు వెళ్లి మూల్యాంకనం చేసేవారమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యశ్వంత్, సుదీర్, బాలచందర్, నాగేందర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎల్‌టీ లోన్లు చెల్లించండి

ధన్వాడ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి పొందిన ఎల్‌టీ లోన్లు ఈ నెల 31 లోపు చెల్లిస్తే 35 శాతం ఓటీఎస్ రిబిట్ వర్తిస్తుందని సంఘం అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహాజన సభ సమావేశం నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. డీసీసీబీలో గోల్డు లోన్ కూడా అందజేస్తున్నారని అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బ్యాంకు మేనేజర్ కల్పనారెడ్డి మాట్లాడుతూ ఎల్‌టీ లోన్లు చెల్లించకపోతే 31వ తేదీ తరువాత భూమిని జప్తు చేస్తామని అన్నారు. సీఈఓ వెంకట్రాములు, సభ్యులు శ్రీనివాస్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీఆర్పీ రాములు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బాలాజీ మాట్లాడారు. కార్యక్రమంలో పీఈటీ కతలప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం అందజేయనున్నారు. ఎంపీపీ నర్సప్ప, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆశన్న మాట్లాడుతూ దామరగిద్ద, బాపన్‌పల్లి,లోకూర్తి, అన్నాసాగర్‌లో చెక్కుల పంపిణీ ఉంటుందని వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

మక్తల్: కాచ్‌వార్‌లో శుక్రవారం పోలేరమ్మ, బోడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పోలేరమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, అంజప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

27న సంత వేలం

మద్దూరు: పట్టణంలో ప్రతి గురువారం నిర్వహించే పశువుల సంత, తైబజారు వేలం 2023–24 సంవత్సరానికి ఈ నెల 27న గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేపట్టనున్నట్లు కార్యదర్శి వెంకటేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు పశువుల సంతకు రూ.1000, తైబజారుకు రూ.1000 వేలం రుసుమును ఈ నెల 25 సాయంత్రం 5 గంటల లోపు చెల్లించాలన్నారు.

పశువైద్య కేంద్రం తనిఖీ



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్, పులిమామిడి పశువైద్య కేంద్రాలను జిల్లా అధికారి శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న మందుల స్టాక్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఏలు రాఘవరెడ్డి, కృష్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో సత్తా చాటాలి



మక్తల్: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో సత్తా చాటాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణామచారీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ ఇమామ్, రేణుక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పరీక్షలు

నారాయణపేట రూరల్ : ఇంటర్ పరీక్షలు జిల్లాలో కొనసాగుతున్నాయి. శుక్రవారం సెకండ్ ఇయర్ విద్యార్థులకు జరిగిన గణితం , జువాలజీ, హిస్టరీ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా 2435 మంది రెగ్యులర్ విద్యార్థులకు 50మంది గైర్హాజరు అయ్యారు. అదేవిధంగా 574మంది ఒకేషనల్ విద్యార్థులకు 55మంది పరీక్ష రాయగా 24మంది పరీక్షలు రాయలేదు. జిల్లా తనిఖీ బృందం అధికారులు మాగనూర్, మక్తల్‌లో పర్యటించగా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మద్దూర్, దామరగిద్ద, సిట్టింగ్ స్క్వాడ్ మక్తల్, మద్దూర్ కేంద్రాలు పరిశీలించారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



కోస్గిలో..



మక్తల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, తదితరులు



మరికల్‌లో..

మక్తల్: ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని నినదించారు. సూపర్‌వైజర్ చెన్నకేశవులు, వైద్య సిబ్బంది శ్రీధర్, మున్వర్‌అలీ, శ్రీధర్, నాగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: గుండుమాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కిష్టమ్మ, కోస్గి ప్రభుత్వాస్పత్రి వైద్యులు అనుదీప్‌లు క్షయ నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు రాంచందర్ జీ, మణిమాల, నీలమ్మ, కృష్ణవేణి, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం క్షయ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాకేష్, ఎంపీటీసీ గోపాల్, సిబ్బంది బస్వరాజ్, అరవింద్, ఆశ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ రాజు, వైద్యాధికారి రాఘవేంద్రరెడ్డి, సిబ్బంది సాయిబాబు, మల్లేశ్వరమ్మ, వెంకటేష్‌గౌడ్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో శుక్రవారం ఊట్కూరు, పులిమామిడి ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సాయిరాంగుప్తా, వైద్య సిబ్బంది మణిమాల, చిట్టెమ్మ, సురేశ్,నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు

ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలి

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయులకు సంబంధించి జీతాల నుంచి అన్ని రకాల పెండింగ్ బిల్లుల వరకు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి గట్టెక్కించాలని కోరుతూ శుక్రవారం యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో స్థానిక డీటీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ సంఘాల ప్రతినిధులు హాజరై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, పరందాములు, బాలాజీ, రెడ్డప్ప, సూర్యచంద్ర, వేణుగోపాల్, మహేందర్, వెంకటేష్, రాజేష్, స్పందన, చంద్రశేఖర్, దశరథ్, రామకృష్ణ, పాల్గొన్నారు.



రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లిలో బీఆర్ఎస్ నేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి పల్లె పల్లెకు యాత్ర శుక్రవారం చేపట్టారు. ఈ మేరకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన దాదాపు 100 మంది నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వర్కటం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ తమ ప్రభుత్వం రావడం ఖాయమని అన్నారు.

రాములమ్మకు సన్మానం



మరికల్: తీలేర్ స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన అంబలి కేంద్రంలో 42 ఏళ్లుగా ఏటా అంబలి పోస్తూ ఉచిత సేవ చేస్తున్న రాములమ్మను శుక్రవారం బాటసారులు సన్మానించారు. గ్రామ మాజీ సర్పంచ్‌లు వెంకారెడ్డి, వజ్రమ్మ, మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డిల జ్ఞాపకార్థంగా ఏటా ఇక్కడ అంబలి కేంద్రం ఏర్పాటు చేసి సేవలు చేస్తున్నారు.

జిల్లాస్థాయిలో సత్తాచాటిన విద్యార్థులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నర్వ: జిల్లా స్థాయిలో ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నర్వ విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబర్చినట్లు ఎంఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్ పదాలు రాయడంలో నిర్వహించిన పోటీల్లో ప్రతి మండలం నుంచి 30 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. మొత్తం 500 మంది విద్యార్థులు పోటీ పడగా మండలంలోని నాగిరెడ్డిపల్లి పాఠశాలకు చెందిన 4వ, తరగ తి విద్యార్థిని శ్రీవల్లి ప్రథమ బహుమతి, 5వ, తరగతి విద్యార్థిని చందన ద్వితీయ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులకు జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్‌మిట్టల్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, బహుమతులు ప్రదానం చేశారని సీఆర్పీ నర్సిములు తెలిపారు.

ధన్వాడ: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇంగ్లీష్ ఓకాబులరీ టాలెంట్ టెస్టులో ధన్వాడ విద్యార్థిని సత్తా చాటింది. జిల్లాస్థాయిలో నిర్వహించిన టెస్టులో బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతికి చెందిన నందిని ద్వితీయ బహుమతి పొందినట్లు హెచ్‌ఎం రమేష్ శెట్టి తెలిపారు. విద్యార్థిని గంటలో 496 ఇంగ్లీష్ పదాలు రాసిందని అన్నారు. అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, డీఈఓ లియాకత్ అలీ చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు వివరించారు.

ఊట్కూరు: పేటలో నిర్వహించిన ఇంగ్లీష్ టెస్టులో శుక్రవారం ఊట్కూరు జీపీఎస్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి లక్ష్మీ, ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి అభిషేక్, అవుసలోనిపల్లి 6వ తరగతి విద్యార్థి త్రివేణి, 7వ తరగతి విద్యార్థి మాధురిలు ప్రతిభ చాటారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, సురేశ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దామరగిద్ద: గర్భిణులు, బాలింతలకు చిన్నారులకు అందించే పౌష్టికాహారం అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ వెంకటయ్య, సూపర్ వైజర్ రూప అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని జీపీఎస్ ఐదో తరగతి విద్యార్థులకు రక్తహీనత అంశం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. పోషణ పక్షం కార్యక్రమం ద్వారా కిచెన్ గార్డెన్, చిరుధాన్యాలు, ఆకుకూరలు, గుడ్లు పాలు వంటి పోషక ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలకు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు భాగ్యమ్మ, అంగన్‌వాడీ టీచర్‌లు వసంతబాయ్, ఈశ్వరమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

అనుమతుల ప్రకారమే ఇసుక తరలించాలి

మాగనూర్: అనుమతుల ప్రకారమే ఇసుక తరలించాలని మైనింగ్ ఆర్ఐ రమేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దవాగు నుంచి ప్రభుత్వ అనుమతులతో ప్రారంభించిన నూతన ఇసుక రీచ్‌ను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ పనులకే కాకుండా మండల ప్రజలకు కూడా గృహ అవసరాలకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా మన ఇసుక మన వాహనంలో బుక్ చేసుకునే వారికి సరఫరా చేసేందుకు వర్కూర్ వాగుతో పాటు మాగనూర్ నుంచి కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా సమీపంలోని పొలాల రైతులు ఇసుక తరలించడం ద్వారా తమ బోరు బావులు ఎండిపోతాయని రీచ్ అనుమతులు రద్దు చేయాలని ఆర్ఐ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్ఐ శ్రీశైలం, వీఆర్ఏలు పాల్గొన్నారు.

27న సమావేశం

నర్వ: ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఈఓ ఉదయ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ప్రధానంగా ఎప్రిల్, 2022 నుంచి మార్చి 30, 2023 వరకు జమాఖర్చులు, దీర్ఘకాలిక రుణాల వసూలుపై, పంట రుణాల వసూళ్లపై చర్చ ఉంటుందన్నారు. 2023–24 అంచనా బడ్జెట్ ఆమోదించడం, సొసైటీ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను ఆమోదించడం ఇతర అంశాలను ప్రవేశపెట్టడం వంటివి ఉంటాయన్నారు.

సన్మానం

మక్తల్: జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సరాఫ్ నాగరాజును శుక్రవారం పట్టణంలో మక్తల్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.శ్రీహరి, తిరుపతి, నర్సిములు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో అన్ని వర్గాలకు మేలు

మద్దూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహా తెలిపారు. శుక్రవారం మండలంలోని కొమ్మూరులో హాథ్ సే హాథ్ జోడో యాత్ర సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు, రూ.500కే సిలిండర్, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు వంటి అనేక పథకాలు అమలు చేస్తామన్నారు. సర్పంచ్ కృష్ణయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజాప్రతినిధులదే కీలకపాత్ర



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీవైస్ చైర్ పర్సన్



బోందల్‌కుంటలో..

మక్తల్: బోందల్‌కుంటలో సీసీరోడ్డు పనులను శుక్రవారం ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, సర్పంచ్ అనిత ప్రారంభించారు. కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి జ్యోతి, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరికల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని జెడ్పీవైస్ చైర్ పర్సన్ సురేఖ అన్నారు. మరికల్ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. పనులు వేగంగా పూర్తిచేయాలని కోరారు. ఈ నెల ఆఖరు వరకు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవి, సర్పంచ్ గోవర్ధన్, ఎంపీటీసీలు సుజాత, గోపాల్, రామస్వామి, బసంత్, రాజేష్, రాములు, తిరుపతయ్య, లక్ష్మయ్య, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన బాలమేళా



బాలమేళాలో పాల్గొన్న చిన్నారులు

కోస్గి: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు శుక్రవారం నిర్వహించిన చిన్నారుల బాలమేళా ఆకట్టుకుంది. పట్టణంలోని 16 అంగన్‌వాడీ కేంద్రాల వారు సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ, కౌన్సిలర్లు బాలేష్, ఇద్రీస్, శ్రీనివాస్‌తోపాటు ఆయా కేంద్రాల టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాగనూర్: బైరంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రీస్కూల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల మాట్లాడారు. చిన్నారుల్లో ఆసక్తి పెంపొందించే విధంగా ప్రీస్కూల్ మేళా వంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

మాగనూర్: మండలంలోని తళంకేరిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం జెడ్పీటీసీ వెంకటయ్య భూమిపూజ చేశారు. రూ. 20లక్షలతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతిగ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. సర్పంచ్ రామస్వామి, ఉపసర్పంచ్ బాలప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

కోస్గి: రానున్న ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు బూత్‌స్థాయి నుంచి కలిసి పని చేయాలని బీజేపీ పాలమూర్ పార్లమెంట్ ప్రభారి చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథుగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. పార్లమెంట్ కో కన్వీనర్ నర్సిములు, విస్తారక్ నాగరాజ్, అసెంబ్లీ ప్రభారి అయ్యప్పరెడ్డి, కన్వీనర్ నర్సిములు, సికింద్రాబాద్ ఇంచార్జీ నాగురావ్ నామాజీ, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మదన్, నాయకులు రమేష్, బాల్‌నర్సయ్య, రాము పాల్గొన్నారు.

ఊట్కూర్: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించె పారిశుద్ధ్య కార్మికుల జీతాలు ప్రభుత్వం సకాలంలో చెల్లించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. దళిత మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 6 నెలలుగా వేతనాలు పెండింగ్ ఉన్నాయని అన్నారు. అనంతరం సూపరింటెండెంట్ కొండయ్యకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి గోపాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

జిల్లాలో ఆయా మండలాల్లో ఉన్న వివిధ గ్రామాలు మండల స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు అందుకున్నాయి. వివిధ విభాగాల్లో అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని అవార్డులు అందజేశారు. ఈ మేరకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం అవార్డులు అందుకున్నారు.ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మద్దూర్‌లో అవార్డులతో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు



అవార్డులతో బోయిన్‌పల్లి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి



బిజ్వార్ సర్పంచ్‌కు మెమోంటోను అందిస్తున్న ఎంపీపీ



అవార్డు అందుకుంటున్న ఎలిగండ్ల సర్పంచ్ దేవమ్మ



నర్వలో అవార్డు స్వీకరిస్తున్న సర్పంచ్, కార్యదర్శి



దామరగిద్ద సర్పంచ్‌కు అవార్డులు అందజేస్తున్న అధికారులు



ధన్వాడలో అవార్డు అందుకుంటున్న రామకిష్టాయిపల్లి సర్పంచ్ మాధవరెడ్డి

చలాన్లు క్లియర్ చేసుకోవాలి

నారాయణపేట రూరల్ : జిల్లా వ్యాప్తంగా అన్ని పీఎస్‌లలో శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాల చలాన్లు వసూలు చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడంతో చలాన్లు కట్టాల్సి వస్తుందని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

అమరచింత: మండలంలోని చంద్రప్పతండాలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణంలో తమ వంతు సహకారం అందిస్తామని నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి తెలిపారు. తండాలో శుక్రవారం నూతన ఆలయంలో పూజలు చేశారు. అనంతరం తండాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పోసిరిగారి విష్ణు, నాగునాయక్, బద్యానాయక్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎదుట కాలనీ వాసుల ధర్నా

అమరచింత: పట్టణంలోని నాల్గో వార్డులో చిన్నకురుమన్న అనే వ్యక్తి రోడ్డును ఆక్రమించి రహదారిపై మట్టిని కప్పి ఉంచాడంటూ కాలనీకి చెందిన ప్రజలు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారిని తన ఇంటి స్థలం అంటూ కబ్జా చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీ ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారికి సీసీ వేయించాలని డిమాండ్ చేశారు. పలు సందర్భాల్లో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చామని, అయిప్పటికీ రహదారిని కబ్జా చేసిన వ్యక్తిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రహదారిపై వేసిన మట్టిని వెంటనే తొలగించాలని ఈసందర్భంగా డిమండ్ చేశారు. లేని పక్షంలో ప్రతి నిత్యం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ ఆర్ఐ కృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అబ్రహం, శ్యాంసుందర్, భాస్కర్, సోలు, ప్రవీణ్, వినోద్, స్వాతి, పద్మమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.